నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 25 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

మెనూ కచ్చితంగా అమలు చేయాలి

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, జనవరి 24 : గురుకుల పాఠశాల విద్యార్థులకు మెనూ కచ్చితంగా అమలు చేయాలని, పౌష్టికాహారం అందిస్తే మంచి ఆరోగ్యంతో ఉన్నత చదువులను అభ్యసిస్తారని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ మైనార్టీ పాఠశాల, కళాశాల అడ్మిషన్ల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కళాశాల అడ్మిషన్ల కోసం దరఖాస్తు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌లాల్ హట్కర్, అధ్యాపకులు, టీచర్లు ఆయనకు బ్యాండ్ మేళం, పూల బొకేలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా, వైద్యానికి గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 5వ తరగతిలో ప్రవేశాల కోసం, మైనార్టీ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో హెచ్ ఈసీ, సీఈసీల్లో 80 సీట్లు ఉన్నాయని ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో https://tmreistelangana.cgg.gov.in/ TMREIS మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రెండు నెలలాయె.. జీతాలు రావాయె

- అవస్థలు పడుతున్న ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్టు లెక్చరర్లు
- ఎదురుచూపులతోనే విద్యార్థులకు బోధన
- జీతాల చెల్లింపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- ఉభయ జిల్లాల్లో పనిచేస్తున్న 28 మంది ఒప్పంద డిగ్రీ అధ్యాపకులు

ఖమ్మం, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పర్మినెంట్ లెక్చరర్ల మాదిరిగానే విధుల నిర్వహణ.. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తూ.. వారికి అర్థమయ్యే రీతిలో బోధిస్తూ సంతృప్తి చెందుతున్నా.. సక్రమంగా వేతనాలు అందక సతమతమవుతున్నారు. నెలనెలా వేతనాలు అందితేనే కష్టంగా కుటుంబాలను వెళ్లదీసే ఈ రోజుల్లో రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు తీరుతాయని, తామూ రెగ్యులర్ అధ్యాపకుల మాదిరిగానే ప్రతి నెల జీతాలు తీసుకుందామంటే అది కలగానే మిగిలియింది.

స్పష్టమైన నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

గత కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏళ్లతరబడి పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను అర్హతలనుబట్టి క్రమబద్ధీకరించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. నెట్, స్లెట్ ఉండి పీహెచ్‌డీ కలిగిన వారిని పర్మినెంట్ చేసింది. ఇలా చేసినప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఇంకా అతి తక్కువ మంది పర్మినెంట్ కాకుండా మిగిలిపోయారు. అయితే వీరికి ప్రస్తుత ప్రభుత్వం జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నెల పూర్తయి రెండో నెల గడుస్తున్నా పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోవడంతోపాటు జీతాల చెల్లింపు విషయంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో దిగులు చెందుతున్నారు.

రెండు నెలల జీతాలు పెండింగ్..

రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ వేతనాల చెల్లింపు విషయంలో ఆలస్యం జరుగుతున్నది. బాధ్యతగా పని చేస్తున్నా జీతం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. నవంబర్, డిసెంబర్ నెలల వేతనాల అంశంపై ప్రభుత్వంలోని ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకుందామన్నా ఎవరిని కలిస్తే ఏమవుతుందోననే భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తూ పాఠాలు బోధిస్తున్నారు.

జిల్లాలో 28 మంది ఒప్పంద అధ్యాపకులు

ఉమ్మడి జిల్లా పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిల్లో 28 మంది వివిధ సబ్జెక్ట్‌ల్లో పాఠాలు బోధిస్తూ ఒప్పంద అధ్యాపకులుగా ఏళ్లుగా పనిస్తున్నారు. సత్తుపల్లి కళాశాలలో ఆరుగురు, ఖమ్మం ఎస్ఆర్‌అండ్‌బీజీ ఎన్ఆర్ కళాశాలలో ఆరుగురు, ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముగ్గురు, భద్రాచలంలో నలుగురు, కొత్తగూడెంలో ఇద్దరు, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు తదితర కళాశాలల్లో ఒక్కొక్కరు చొప్పున కాంట్రాక్ట్ లెక్చరర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలి

రెగ్యులర్ అధ్యాపకులతోపాటే ప్రతి నెల వేతనాలు చెల్లించాలి. మహిళా అధ్యాపకుల సెలవుల విషయంలో చాలా సమస్యలున్నాయి. పదిహేను సంవత్సరాల నుంచి విధులు నిర్వర్తిస్తున్నా. వేతనాలు సకాలంలో అందిస్తూ మా గౌరవానికి భంగం కలుగకుండా అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి.

– పి.సరిత, ఒప్పంద అధ్యాపకురాలు

చాలా ఇబ్బందిగా ఉంది

జీతాలు సకాలంలో అందకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నెలనెలా వేతనాలు చెల్లించడంతోపాటు కొంత వెసులుబాటు కల్పించి కండీషన్‌పై మిగిలిన ఒప్పంద అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి. ప్రభుత్వం వేసవి సెలవులతో ముడిపెట్టకుండా 12 నెలల సమయానికి జీతాలు చెల్లించాలి.

– జి.శివాజీ, ఒప్పంద అధ్యాపకుడు

పార్లమెంట్ ఎన్నికలకు సంసిద్ధులు కావాలి

బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు

మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 24: బీఆర్ఎస్ శ్రేణులు వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు విజయం కట్టబెట్టి విజయకేతనం ఎగురవేయాలన్నారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలోకి వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. తాను త్వరలో ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గంలో పర్యటిస్తానని, పార్టీ నాయకులను, కార్యకర్తలు, అభిమానులను ప్రత్యక్షంగా కలుస్తానని స్పష్టం చేశారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, పెండింగ్ ప్రాజెక్టులపై గళమెత్తుతానన్నారు. గురువారం కొత్తగూడెం జిల్లాకేంద్రంలో జరిగే జిల్లా దిశా కమిటీ సమావేశంలో ప్రజాసమస్యలపై చర్చిస్తామన్నారు. అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలను ఎంపీ నివృత్తి చేశారు. తర్వాత సమస్యల పరిష్కారం కోసం నగరానికి వచ్చిన ప్రజలు అందించిన వినతులు స్వీకరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాములునాయక్, వివిధ మండలాల నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్, దండా పుల్లయ్య, బెల్లం వేణుగోపాల్, బాణాల వెంకటేశ్వరరావు, చిత్తారు సింహాద్రి యాదవ్, పోట్ల శ్రీను, చిరంజీవి, చెరుకుమల్లి రవి, మాలోత్ శకుంతల, కిశోర్, సుధాకర్, లక్ష్మీ రెడ్డి ,చేబ్రోలు మల్లికార్జునరావు, పెంట్యాల పుల్లయ్య, బోజెడ్ల రామ్మోహన్‌రావు, ఏలూరి శ్రీనివాసరావు, కొమ్మినేని ఉపేందర్ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో బెడ్ల సంఖ్య పెంచాలి

జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో చైర్మన్ కంచర్ల

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మూత్రపిండాల రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదని, దీనికి అనుగుణంగా బెడ్ల సంఖ్య పెంచాలని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో బుధవారం జరిగిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. జిల్లా కేంద్రానికి వైద్య కళాశాలను తీసుకురావడంతోపాటు 30 పడకలు ఉన్న ఆస్పత్రులను వంద పడకలకు పెంచిందన్నారు. ప్రస్తుతం ఆస్పత్రులకు మూత్రపిండాల రోగుల సంఖ్య పెరగడంతో బెడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకోసం కొత్తగూడెం, భద్రాచలంలో బెడ్ల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు బాగున్నా మార్కెట్ ధరలకు అనుగుణంగా వారికి గిట్టుబాటు కాకపోవడంతో రోజూ పప్పు, కూరలకే పరిమితం కావాల్సి వస్తోందన్నారు.

పారిశుధ్య కార్మికులు ఉండాలి: ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు ఉండాలని, ప్రస్తుతం పంచాయతీ కార్మికులు పని చేస్తున్నా వారు సరిపోవడం లేదని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. వైద్య రంగంలో మార్పులు వచ్చినా ప్రతి పీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులు ఉండాలన్నారు. ఆర్ఎంపీల వద్ద ఉన్న రోగులు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద ఉండడం లేదన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిజాలు చెప్పినప్పుడు ప్రభుత్వం వద్దకు మంచి సమాచారం చేరుతుందన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో విద్యాలత, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎమ్మెల్సీ

పాఠశాల విద్య బలోపేతం కావాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం జడ్పీ కార్యాలయంలో చైర్మన్ అనుమతితో విద్యాశాఖపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలన్నారు. ప్రతి పాఠశాలలో స్వీపర్ ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రీప్రైమరీ నుంచి 10వ తరగతి వరకు ఒకే ఆవరణలో ఉంటే ఎక్కువ మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. సమీక్షలో డీఈవో వెంకటేశ్వరాచారి, ఎంఈవోలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

ప్రగతి మైదాన్‌ను సందర్శించిన కలెక్టర్ ప్రియాంక ఆల

ప్రగతి మైదాన్‌లో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం అర్బన్, జనవరి 24 : గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. బుధవారం స్థానిక ప్రగతి మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఆమె అధికారులకు తగు సూచనలు చేశారు. 26వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రగతి మైదానంలో జరగనున్న వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలన్నారు. వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునే విధంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీసీవో వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, ఇరిగేషన్ ఈఈ అర్జున్, ఉద్యాన అధికారి మరియన్న, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య, ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్ 'బీఆర్క్'

విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఖమ్మం నగరంలో ఆరు కేంద్రాలు 30 మంది విద్యార్థులు గైర్హాజరు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 24: ఖమ్మం నగరంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో బుధవారం ప్రశాంతంగా జాయింట్ ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ (జేఈఈ) మెయిన్ బీఆర్క్ పరీక్ష జరిగింది. 1,071 మంది అభ్యర్థులకు 1,041 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల (సెషన్-2) వరకు పరీక్ష జరిగింది. పరీక్ష సమయానికి అరగంట ముందు నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతించమనే నిబంధన అమలులో ఉండడంతో అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాల్లోకి వచ్చారు. కేంద్రాలను అబ్జర్వర్లు పర్యవేక్షించారు.

సెంటర్ల వారీగా హాజరు ఇలా..

బొమ్మ కేంద్రంలో 100 మందికి 98 మంది, విజయ కేంద్రంలో 200 మందికి 195 మంది, శ్రీచైతన్య కేంద్రంలో 150 మందికి 145 మంది, ఎస్సీ ఐటీ కేంద్రంలో 281 మందికి 276 మంది, ప్రియదర్శిని కేంద్రంలో 250 మందికి 239 మంది, కవిత మెమోరియల్ కేంద్రంలో 90 మందికి 89 మంది హాజరయ్యారని పరీక్షల జిల్లా కో-ఆర్డినేటర్ రామసహాయం పార్వతీరెడ్డి తెలిపారు. .

27 నుంచి బీటెక్ విద్యార్థులకు..

ఈనెల 27 నుంచి వచ్చే నెల 1 వరకు ఆరు కేంద్రాల్లో జేఈఈ బీటెక్ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదు. అభ్యర్థులు కేవలం హాల్‌టికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను మాత్రమే కేంద్రాల్లోకి తీసుకురావాలి. పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్స్ పనిచేయకుండా జామర్స్ అమర్చి ఉంటాయి.

హాకీలో 'సింగరేణి'కి బంగారు పతకం

క్రీడాకారులను సన్మానిస్తున్న ఏరియా జీఎం

రామవరం, జనవరి 24 : కోలిండియా లిమిటెడ్ ఇంటర్ కంపెనీ హాకీ టోర్నమెంట్‌లో సింగరేణి ఉద్యోగులు బంగారు పతకం సాధించారు. దీంతో పతకం సాధించిన ఉద్యోగులను ఏరియా జీఎం శాలెంరాజు ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. అలాగే నాగ్‌పూర్‌లో జరిగిన బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన వారిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా జీఎంతోపాటు ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, డీజీఎం యోహాను, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, శ్రావణ్‌కుమార్, సదానందం, సత్యనారాయణ, తావుర్యా, సాగర్, మజ్జి మురళి, ఎస్‌కే గులాం గౌస్, రాజ్‌కుమార్, అజ్మీరా మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన ఎర్ర బంగారం

విక్రయానికి 33 వేల బస్తాలు రాక

ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 24 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ఎర్ర బంగారం పోటెత్తింది. ఈ నెల 26 నుంచి మరో మూడు రోజులపాటు వరుసగా మార్కెట్‌కు సెలవులు ఉన్న నేపథ్యంలో రైతులు సరుకును విక్రయానికి తరలించినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం జెండా పాట సమయానికి వివిధ జిల్లాల నుంచి సుమారు 30 వేల బస్తాలను యార్డుకు తీసుకురాగా.. తర్వాత 3 వేల బస్తాల మిర్చి వచ్చింది. జెండా పాటలో క్వింటా గరిష్ఠ ధర రూ.21 వేలు పలికింది. మధ్య ధర రూ.18,500 కాగా.. కనిష్ఠ ధర క్వింటా రూ.14 వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. తాలు రకం క్వింటా గరిష్ఠ ధర రూ.11,500 కాగా.. కనిష్ఠ ధర రూ.6,400 పలికింది. అయితే రోజు వ్యవధిలోనే క్వింటా రూ.500 జెండా పాట తగ్గడం పట్ల రైతులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. మార్కెట్‌కు భారీగా సరుకు వచ్చినప్పటికి సకాలంలో కాంటాలతో పాటు తోలకాలు పూర్తయ్యాయి. మార్కెట్లో క్రయ విక్రయాలను గ్రేడ్-టూ అధికారి బజార్, అసిస్టెంట్ సెక్రటరీ వజీర్ పర్యవేక్షించారు.

జాడలేని మామిడి పూత

- వాతావరణ మార్పులతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం
- మామిడి తోటల కొనుగోలుకు ఆసక్తి చూపని వ్యాపారులు
- పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని దిగులు చెందుతున్న రైతులు

పూత లేని మామిడి చెట్టు

సత్తుపల్లి, జనవరి 24 : వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, అధిక వర్షాలు, చలి తీవ్రత, పొగమంచు ప్రభావం మామిడి పూతపై తీవ్రంగా పడింది. ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో మామిడి తోటలు పూతతో నిండిపోవడంతోపాటు సంక్రాంతి పండుగలోపే పిందెలు కాసి కళకళలాడేవి. కానీ.. ఈ ఏడాది పండుగ పోయినా పూత జాడ కనిపించడం లేదు. తోటలోని ఏ చెట్టు చూసినా కొత్త ఇగురు, పూత లేకపోవడంతో వెలవెలబోయి కనిపిస్తున్నాయి. జిల్లాలో పరిస్థితి ఇలాగే ఉంటే మామిడి పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారనున్నది.

33 వేల ఎకరాల్లో మామిడి సాగు

జిల్లాలో 33 వేల ఎకరాల్లో మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. సాధారణంగా మామిడి చెట్లకు ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టకుండానే సీజన్ వచ్చిందంటే విరగబూస్తాయి. అలాంటిది.. ఉద్యాన శాఖ అధికారుల సూచన మేరకు ఈ ఏడాది తోటల్లో అనేక సస్యరక్షణ చర్యలు చేపట్టినా పూత కనిపించడం లేదని పలువురు రైతులు దిగులు చెందుతున్నారు. ఏటా మామిడి వ్యాపారులు పూత దశలోనే తోటలను కొనుగోలు చేస్తారు. ఈ ఏడాది పూత సరిగా రాకపోవడంతో తోటల కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. దీంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి

మామిడి తోటలో ఎకరాకు దాదాపు 100 నుంచి 150 వరకు మొక్కలు నాటుతున్నారు. వీటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. పంట చేతికొచ్చే సమయానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడికి ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. అయితే తోటల్లో వందల సంఖ్యలో చెట్లు ఉన్నప్పటికీ ఒకటి, రెండు చెట్లకు మాత్రమే పూత పూస్తున్నదని, ప్రస్తుత పరిస్థితుల్లో పూత పరిస్థితిని చూస్తే ఈ ఏడాది పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వస్తుందో.. లేదోనని.. రైతులు దిగులు చెందుతున్నారు. సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లోనే పూతకొచ్చి జనవరి మాసంలో చిరు దశలో పిందెలు చేతికొస్తాయి. ఉగాది నాటికి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి ఉంటుంది. కానీ.. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఉద్యాన శాఖ అధికారులు మామిడి తోటలను సందర్శించి.. ఎలాంటి చర్యలు తీసుకుంటే పూత పరిస్థితి మెరుగవుతుందో అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఆలస్యంగా వస్తున్న పూత

ఉష్ణోగ్రతల హెచ్చు తగ్గులు, అధిక వర్షాలతో మామిడి చెట్లకు పూత ఆలస్యంగా వస్తున్నది. జిల్లాలో 33 వేల ఎకరాల్లో మామిడి తోటలను రైతులు సాగు చేస్తుండగా.. సగానికి పైగా చెట్లకు పూత వచ్చింది. ఫిబ్రవరి, మార్చి వరకు మామిడి చెట్లకు పూత వచ్చే అవకాశం ఉన్నది. రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం.

– అనసూయ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, ఖమ్మం

పూత కనిపించడం లేదు

ఈ ఏడాది మామిడి చెట్లకు పూత కనిపించడం లేదు. గతంలో ఇప్పటికే చెట్లన్నీ పూతతో నిండి ఉండేవి. ఈ ఏడాది ఇప్పటివరకు ఏ చెట్టు చూసినా పూత కనిపించడం లేదు. సంక్రాంతి పండుగ తర్వాత పూత వచ్చినా అది నిలిచే అవకాశం తక్కువ. ఈసారి మామిడి దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉన్నది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– సత్యనారాయణరెడ్డి, మామిడి రైతు, రేజర్ల

కొబ్బరి సాగుతో దీర్ఘకాలిక ఆదాయం

కొబ్బరి బోర్డు డీడీ కుమార్ వేల్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్

కొబ్బరి చెట్టు ఎక్కే పద్ధతిపై శిక్షణ ఇస్తున్న నిపుణులు

అశ్వారావుపేట, జనవరి 24 : రైతులకు కొబ్బరి సాగుతో దీర్ఘకాలిక నికర ఆదాయం లభిస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగుకు సబ్సిడీ పథకాలు అమలు చేస్తున్నాయని కొబ్బరి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్‌లు తెలిపారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో కొబ్బరి వృక్ష మిత్రులకు చెట్టు ఎక్కే విధానం, పంట సేకరణ, చీడపీడల నివారణ చర్యలపై ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొబ్బరి గెలల సేకరణకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. శిక్షణలో భాగంగా వృక్ష మిత్రులకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు జాగింగ్, యోగా, శాస్త్రీయ జ్ఞానం, స్కిట్, డ్రామా, క్షేత్ర దర్పణ వంటి అంశాలు నిర్వహిస్తామని, వీటితో వృత్తి నైపుణ్యం పెంపొందుతుందన్నారు. అనంతరం కొబ్బరి సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శిరీష, జి.గోపాలకృష్ణమూర్తి, పి.నీలిమ, ఐవీఎస్ రెడ్డి, శ్రావణ్‌కుమార్, రమేశ్, కోటేశ్వర్, ఝాన్సీరాణి, ఎస్ఎంటీ జంబమ్మ, ఏఈఎల్‌పీ విద్యార్థులు, అశ్వారావుపేట, పేరాయిగూడెం, నారంవారిగూడెం వృక్ష మిత్రులు పాల్గొన్నారు.